సాక్షి
కుమురం భీం

శనివారం : 4 : ఫిబ్రవరి : 2023



నెరవేరని 'ఆశ'ల డిమాండ్లు

రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదు. ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. 8లో▸



నాందేడ్ సభ.. ప్రతిష్టాత్మకం

నాందేడ్‌లో ఈ నెల 5న బీఆర్‌ఎస్ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సీఎం కేసీఆర్ హాజరయ్యే ఈ సభ ఏర్పాట్ల కోసం నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
32.1 /12.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా అనిపిస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వలస కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- అదనపు కలెక్టర్ రాజేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్: జిల్లాలోని వలస కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, ఎస్సీ కార్పొరేషన్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు పరిశ్రమల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన కూలీలు పని చేస్తున్నారన్నారు. జిల్లాకు వలస వచ్చి జీవనోపాధి పొందుతున్న వారి వివరాలను ఈ– శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వలస కూలీల పిల్లల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగాలకు చెందిన కూలీలు ఈ– శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకునే విధంగా సంబంధిత అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ శాఖ అధికారి సజీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

ఆసిఫాబాద్‌రూరల్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈవో అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 14 వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు https://bse.telangana.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించాలి



మాట్లాడుతున్న డీపీవో రమేశ్

వాంకిడి(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతిరోజూ వంద మంది కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెప్రగతి పనులు తుది దశకు చేరుకుంటున్న నేపథ్యంలో పనుల సంఖ్య పెంచాలన్నారు. కూలీల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ షెడ్‌ల ద్వారా గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి ఎరువులు తయారు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయమే గ్రామాలకు చేరుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జాబ్‌కార్డులు, ఆధార్‌తో అనుసంధానం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శివకుమార్, ఈజీఎస్ ఏపీవో శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు మార్చిలో పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెంచిన వేతనాలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రభుత్వమే కోడిగుడ్లు సరఫరా చేయాలని, పదేళ్ల క్రితం ఇచ్చిన వంట పాత్రలు చెడిపోయాయని చెప్పినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, శారద, రూప, విజయ, విమల, సుజాత, సాయమ్మ, నాగలక్ష్మి, సురేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న జాతరకు వెళ్లొద్దాం..!



గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం

- గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి జాతరకు ఏర్పాట్లు
- రంగులరాట్నం, దుకాణాల ఏర్పాటుతో సందడి
- నేడు అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం
- రేపు రథోత్సవం
- ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు



ఆలయంలో వేంకటేశ్వర స్వామి



భక్తుల కోసం టెంట్లు ఏర్పాటు చేస్తున్న కూలీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం జాతరకు ముస్తాబైంది. శనివారం నుంచి సోమవారం వరకు అంగరంగ వైభవంగా జాతర నిర్వహించనున్నారు. గంగాపూర్ బాలాజీ వెంకన్న చెయ్యెత్తి మొక్కితే కోరిన కోరికలు తీరుస్తూ గుండెల్లో కొలువై ఉంటాడని భక్తుల నమ్మకం. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ శివారులోని వాగు ఒడ్డున కొలువైన శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మూడురోజుల పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మొదటి రోజు స్వామి వారి కల్యాణం, రెండో రోజు రథోత్సవం, మూడో రోజు భక్తులకు దర్శనంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరకు ఉమ్మడి జిల్లాతోపాటు కరీంనగర్, వరంగల్, మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

పూర్తయిన ఏర్పాట్లు

ఉమ్మడి జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన బాలాజీ వేంకటేశ్వర స్వామి మూడు రోజుల జాతరకు అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయంతోపాటు పోతాజీ సమాధి, ముఖద్వారాన్ని రంగులు వేసి ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించగా, మండల కేంద్రంలోని వ్యాపారులు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు. రథోత్సవానికి సుమారు 2 లక్షల మంది భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుంటారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దుకాణాలు, రంగుల రాట్నం, జంపింగ్ పార్క్ ఏర్పాటుతో పరిసరాలు సందడిగా మారింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక బస్సులు

ఆసిఫాబాద్‌అర్బన్: గంగాపూర్ జాతరకు ఆసిఫాబాద్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు డీఎం శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ నుంచి 10, కాగజ్‌నగర్ నుంచి 8, బెల్లంపల్లి బజార్/మార్కెట్ నుంచి 8 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. భక్తులు ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆలయ చరిత్ర

సుమారు 13వ శతాబ్దానికి ముందు గంగాపూర్‌కు చెందిన ముమ్మడి పోతాజీ అనే భక్తుడు చిన్నతనం నుంచి భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామిని కొలుస్తూ ఏటా మాఘశుద్ధ పౌర్ణమి రోజున తిరుమలకు కాలినడకన వెళ్లి మొక్కులు చెల్లించుకునేవాడు. కాలక్రమేనా వయస్సు పైబడి ఆరోగ్యం క్షీణించటంతో తిరుపతి వరకు వెళ్లలేక మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో స్వామి వారే పోతాజీ కలలో కనిపించి గ్రామ పొలిమేరలోని గుట్టలో కొలువై ఉన్నానని, నాకోసం ఆలయం నిర్మించాలని కోరినట్లు స్థానికులు చెప్పుకుంటారు. ఆలయంలో ఏటా మాఘశుద్ధ పౌర్ణమి పర్వదినాన నీతోపాటు భక్తుల కోసం దర్శనం ఇస్తానని చెప్పి నిష్క్రమించినట్లు పేర్కొంటున్నారు. గంగాపూర్ వాగులో పుణ్యస్నానం ఆచరించి గుట్టను తొలగవగా గుట్ట లోపల స్వామి పట్టి నామాలు దర్శనమిచ్చాయని గ్రామస్తులు చెబుతున్నారు. నాటి నుంచి ఏటా మాఘశుద్ధ పౌర్ణమి పర్వదినాన స్వామివారు ఆలయంలో కొన్ని గడియలు భక్తులకు దర్శనమిస్తుంటాడని నమ్మకం.



జాతరలో ఏర్పాటు చేసిన దుకాణాలు

ఏర్పాట్లు పూర్తి

గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జాతరకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. జిల్లాలో జరిగే అతిపెద్ద జాతర ఇది. శనివారం నుంచి జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– బాపిరెడ్డి, ఆలయ ఈవో

అంగరంగ వైభవంగా..

మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా గంగాపూర్ బాలాజీ ఆలయంలో జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతుంది. మొదటి రోజు స్వామి, అమ్మ వార్ల కల్యాణం ఉంటుంది. రెండో రోజు స్వామివారి ఉత్సవ విగ్రహాలతో కనుల పండువగా రథోత్సవం నిర్వహిస్తాం.

– కొమ్మెర గణేశ్‌శర్మ, ఆలయ అర్చకులు

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

- ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌ఎం జానిరెడ్డి

ఆసిఫాబాద్‌అర్బన్: బస్సుల్లో ప్రయాణికులే మన దేవుళ్లని, వారితో మర్యాదగా మెలగాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో అద్దె బస్సుల డ్రైవర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు సిబ్బంది, కార్మికులు కృషి చేయాలన్నారు. బస్సులు నడిపే సమయంలో డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని సంస్థకు ఆదాయాన్ని పెంచేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డీఎం శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్, ఎంఎఫ్ మధుసూదన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సేఫ్టీ వార్డెన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కంటి పరీక్షలు



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

రెబ్బెన(ఆసిఫాబాద్): అర్హులందరికీ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా నేత్ర పరీక్షలు నిర్వహించేలా చూడాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. కంటి పరీక్షలు, మందులు, కళ్లద్దాల పంపిణీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు శిబిరంలో ఉండి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వైద్యసిబ్బందికి భోజనం, అల్పాహారం అందుబాటులో ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఆమె వెంట వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జీలే దిక్కు..!

- వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కొరవడిన పర్యవేక్షణ
- కార్యదర్శులు లేక ఇబ్బందులు
- అన్నదాతలకు అందని మెరుగైన సేవలు



ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో కోట్లాది రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూరుస్తున్న మార్కెటింగ్ శాఖ నిర్వహణ కొంతకాలంగా అస్తవ్యస్తంగా తయారైంది. కార్యదర్శులు లేకపోవటం.. ఉద్యోగాలు కూడా భారీగా ఖాళీగా ఉండటంతో నిర్వీర్యమైపోతోంది. దీంతో అన్నదాతలకు సకాలంలో సరైన సేవలు అందకపోగా, మార్కెట్ల ఆదాయానికి సైతం గండిపడుతోంది. చెక్‌పోస్టులపై కూడా పర్యవేక్షణ లేకపోవటంతో ఆదాయం తగ్గిపోతోంది. చాలా మార్కెట్లలో శాశ్వత ఉద్యోగులు తక్కువగా ఉన్నారు. తాత్కాలిక ఉద్యోగులకు కీలకమైన బాధ్యతలు అప్పగించి పనిచేయిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్లకు కార్యదర్శులు లేకపోవటంతో అక్కడ నిర్వహణ కష్టంగా ఉంది. జిల్లాలో మొత్తం మూడు వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. అధిక భాగం ఇన్‌చార్జీలే అక్కడ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు లక్సెట్టిపేట కార్యాలయంలో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఆయన జన్నారం మార్కెట్‌కు కూడా ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆయనకు ఆసిఫాబాద్ మార్కెట్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.
- కాగజ్‌నగర్ మార్కెట్‌కు పెద్దపల్లి జిల్లా ధర్మారం మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌ని ఇన్‌చార్జిగా నియమించారు. ఈయన బెల్లంపల్లి మార్కెట్‌కు సైతంగా ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇలా ఒక్క అధికారి మూడేసి మార్కెట్లను ఎలా పర్యవేక్షిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

జిల్లాలో ఖాళీలు..

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, జైనూర్ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీలో ఆరుగురు పనిచేయాల్సి ఉండగా ఇద్దరు ఉన్నారు. మిగిలిన నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగజ్‌నగర్‌లోనూ ఆరు పోస్టులకు ఐదు ఖాళీగా ఉన్నాయి. జైనూర్‌లో నాలుగు పోస్టులుంటే రెండు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాలో ఖాళీగా ఉన్న ఒక్క స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి పోస్టును రెండు రోజుల క్రితం భర్తీ చేశారు. ఇక గ్రేడ్– 3 కార్యదర్శులు మూడు పోస్టులకు రెండు ఖాళీయే. సూపర్‌వైజర్ పోస్టు, ఏఎంఎస్ పోస్టు భర్తీ కాలేదు. ఒక ఎల్‌డీసీ పోస్టు, 3 వాచ్‌మన్ పోస్టులు.. 2 అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం జిల్లాలో 16 మంది ఉద్యోగులు పనిచేయాల్సి చోట ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసిన ఎమ్మెల్యే సక్కు



సీఎస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ సమస్యలు వివరించారు. జీవో నంబర్ 3 పునరుద్ధరణకు కృషి చేయాలని, ప్రస్తుత ప్రమోషన్లలో షెడ్యూల్ ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఆదివాసీ నిరుద్యోగ యువతీయువకులకు ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ అభివృద్ధికి గిరి వికాస్ పథకం ద్వారా అధిక నిధులు కేటాయించాలని, గిరిజన ప్రాంతాల సబ్ సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చి స్థానికులతో జీఎన్ఎం, ఏఎన్ఎం పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, నియోజకవర్గంలోని ప్రాజెక్టులు, చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చీఫ్ సెక్రటరీ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

సిర్పూర్(టి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకే పంపాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా తీర్చిదిద్దిన నవేగాం, హుడ్కిలి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రైవేట్‌కు ధీటుగా ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ఉంటుందన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మరిన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంపీపీలు చునార్కర్ సువర్ణ, నానయ్య, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ కిజర్‌హుస్సేన్, ఎంపీడీవో రాజేశ్వర్, సర్పంచులు యాదగిరి బ్రహ్మయ్యయాదవ్, ప్రభాకర్, చిన్నుబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడేలా 'అండర్‌పాస్' నిర్మించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రంలో అండర్‌పాస్ వంతెనను ప్రజలకు ఉపయోగపడేలా శివాజీచౌక్ వద్ద నిర్మించాలని పలువురు నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ తెలంగాణ కార్యాలయంలో డెప్యూటీ జనరల్ మేనేజర్ భీమసేనరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. శివాజీచౌక్ జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపడితే చౌపన్‌గూడ వైపు ఉన్న గ్రామాల ప్రజలతోపాటు మండలానికి వచ్చే వారికి ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. ఈ సమస్యను మంచిర్యాల హైవే అథారిటీ పీడీ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ మేనేజర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచులు బండె తుకారాం, కమలాకర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు అశోక్ మహోల్కర్, మాజీ ఎంపీటీసీ వినోద్ ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

కౌటాల(సిర్పూర్): గ్రామీణ ప్రాంతాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. కౌటాల మండలం వైగాం గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థ కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. వంతెన నిర్మాణానికి రూ.2.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు సకాలంలో పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు అజ్మత్ అలీ, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు మధుకర్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్పాభిషేకం

కౌటాల(సిర్పూర్): మండలంలోని తాటిపల్లి సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీసిద్ధి హనుమాన్ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పుష్పాభిషేకం నిర్వహించారు. ప్రతిష్టాపన పూజల్లో భాగంగా అర్చకులు ధాన్యాభిషేకం, మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయంలో నేడు శ్రీవిఠలరుక్మిణి గరుడ ధ్వజస్తంభం, నవగ్రహ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు.



పుష్పాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా సొంత ఇల్లు, స్థలం లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. పేదలు ఇంటి స్థలం, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయి, లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారన్నారు. జిల్లాలో ఇందుకు విరుద్ధంగా ఇప్పటివరకు ఒక్కరికి కూడా అందజేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వేగంగా డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం, నాగేష్, రాజేశ్వర్, వంశీ, టీకానంద్, ప్రజాసంఘాల పోరాట సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గడ్డివాము దగ్ధం


మంటలు ఆర్పుతున్న రైతులు

లక్సెట్టిపేట: మండలంలోని అంకతిపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్ తన ఇంటి వద్ద నిల్వ చేసిన గడ్డివాము ప్రమాదవశాత్తు కాలిపోయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా గడ్డివాము వద్ద మంటలు వ్యాపించాయి. స్థానికులతోపాటు సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని నీళ్లు పోసి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సుమారు రూ.50వేల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడాపోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శేఖర్‌రావు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఉషోదయ పాఠశాలలో ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు నిర్వహించే పోటీలను ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, జిల్లా క్రీడలు, యూత్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శేఖర్‌రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి వారిలోని నైపుణ్యాన్ని వెలికితీయడం అభినందనీయమన్నారు. సోషల్ వెల్ఫేర్ పర్సనల్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మచరణ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి శరత్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీ చంద్రమోహన్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు ఉస్మాన్, పోటీల నిర్వాహకులు బాలాజీ, ఉప్పలయ్య, విక్రమరావు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్‌టౌన్: చార్టెడ్ అకౌంట్స్ పరీక్షల్లో కాగజ్‌నగర్ పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కన బర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాలయంలో 12వ తరగతి పూర్తి చేసిన వెలుపల అభిరాం, దాని లక్ష్మి ప్రణీత్, శ్రీజ, పరమేశ్వర్‌రెడ్డి సీఏ ఫౌండేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. డిసెంబర్‌లో సీఏ అర్హత పరీక్ష రాయగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్స్ ఇండియా శుక్రవారం ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

లోకేశ్వరం: మండల కేంద్రంలో పెద్దోల్ల పోతన్నకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాక్షికంగా దగ్ధమైంది. ఆర్ఐ బాలకిషన్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పోతన్న తన భార్య భోజవ్వతో కలిసి కూలీ పనులకు వెళ్లాడు. 11గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకొని ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఇరుగుపొరుగువారు గమనించి మంటలను ఆర్పివేశారు. రూ.50వేల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్ఐ బాలకిషన్ తెలిపారు.

జాతరకు వేళాయె

- ముస్తాబైన నరనారాయణస్వామి ఆలయం
- 38వ వార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి జాతర ప్రారంభం
- అధికసంఖ్యలో రానున్న భక్తులు



జన్నారం: దేశంలోని రెండోది, రాష్ట్రంలో ఏకైక నరనారాయణ స్వామి ఆలయం జాతరకు ముస్తాబవుతోంది. గోదావరి సమీపాన కాకతీయుల కాలంలో వెలిసిన శ్రీనరనారాయణ స్వామి ఆలయం ఈనెల 4నుంచి 6వరకు నిర్వహించే 38వ వార్షికోత్సవం, జాతరకు సిద్ధమైంది. జన్నారం మండలం కలమడుగు గోదావరి తీరాన చోళులు నిర్మించిన ఈ ఆలయంలో గల నరనారాయణస్వామి (శ్రీకృష్ణార్జునులు) కోరుకున్న భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తున్నారు. అందుకే ఏటా మాఘమాస పౌర్ణమికి మూడురోజులు జాతర జరుపుతారు. జాతరను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో గల బద్రీనారాయణస్వామి ఆలయం మొదటిది కాగా కలమడుగులోని ఈ నరనారాయణస్వామి ఆలయం రెండోదని గతంలో చినజీయర్‌స్వామి చెప్పినట్లు పురోహితులు చెబుతున్నారు. చోళుల కాలంలో నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోగా 1986 జూన్ 7న ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. అప్పటి నుంచి వార్షికోత్సవం జరుపుతున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈనెల 4నుంచే కార్యక్రమాలు ప్రారంభం కాగా 6వరకు జాతర కార్యక్రమాలు కొనసాగుతాయి. నిర్మల్, మంచిర్యాల జిల్లాలను కలిపే కలమడుగులో అట్టహాసంగా నిర్వహించే ఈ ఆలయ వార్షికోత్సవానికి ఆలయ కమిటీ అన్నీ సిద్ధం చేసింది. జాతరకు ఎమ్మెల్యే రేఖానాయక్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.

వార్షికోత్సవ కార్యక్రమాలు

4వ తేదీన నగర సంకీర్తన చేసి గ్రామస్తులంతా గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం నరనారాయణస్వామి పూర్ణాభిషేకం, వీరాంజనేయస్వామికి అభిషేకం, నవగ్రహ తైలాభిషేకం, ధర్మ ధ్వజారోహణ, తులసిపూజ, గోపూజ, విష్ణుసహస్ర నామార్చన, కుంకుమార్చన కార్యక్రమాలు, 5న శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి, సంపూర్ణ గీత హవన హోమాలు, అగ్గిమల్లన్నస్వామికి బోనాలు, సాయంత్రం వివేకానంద పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, 6న నరనారాయణస్వామి, అంజనేయస్వామికి అభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యాదగిరి స్వదేశ్‌రావు, గౌరవాధ్యక్షుడు కాశిర సర్సయ్య, సర్పంచ్ యాదగిరి కార్తీక్‌రావు, సభ్యులు తిరుమల అంజగౌడ్, కిషన్ గౌడ్, నరేంద్రశర్మ, శంకరయ్య తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాం

కలమడుగు నరనారాయణస్వామి జాతర చాలా ఘనంగా జరుపుతారు. జాతరకు భక్తులు అధికసంఖ్యలో వస్తారు. మా మండలం నుంచే కాకుండా నిర్మల్, కడెం, ఖానాపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల నుంచి అనేక మంది తరలివస్తారు. జాతర సందర్భంగా ఇక్కడికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం జాతరకు అన్నీ సిద్ధం చేస్తున్నాం.

– యాదగిరి స్వదేశ్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్

మహిమ గల దేవుడు



చోళుల కాలంలో పవిత్ర గోదావరి తీరాన వెలిసిన మహిమగల దేవుడు నరనారాయణస్వామి. దేశంలో నరనారాయణస్వామి ఆలయాలు బద్రీనాథ్ ఆలయం తర్వాత కలమడుగు గోదావరి తీరాన నిర్మితమైంది. ఇది చోళుల కాలంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. పునర్నిర్మాణం అనంతరం వార్షికోత్సవాలను జరుపుతున్నాం. స్వామివారిని దర్శించుకునేందుకు జన్నారం మండలం వారే కాకుండా ఇతర మండలాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో వస్తారు.

– కాశిర రాజనరేంద్రశర్మ, ప్రధాన అర్చకుడు

క్రీడాకారుడికి ఆర్థిక కష్టాలు


జాతీయ క్రీడాకారుడు రవికిరణ్

కోటపల్లి: జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న క్రీడాకారుడికి ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతీ పోటీలో బంగారు పతకం సాధిస్తున్నా ప్రత్యేక శిక్షణకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన ఆసరెల్లి రవికిరణ్ జాతీయ క్రీడల్లో రాణిస్తున్నాడు. దివ్యాంగుడైన రవికిరణ్ తండ్రి లక్ష్మీనారాయణ మరణించడంతో తల్లి అమత కూలీ పని చేసుకుంటూ వచ్చిన పింఛన్ డబ్బులతో ఆర్థిక తోడ్పాటు నందిస్తోంది. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆర్థిక తోడ్పాటు అందించే వారే కరువయ్యారు. గుజరాత్‌లో జరిగిన 12వ పారా, అథ్లెటిక్స్ జూనియర్, సబ్‌జూనియర్స్ విభాగంలో జావెలిన్‌త్రోలో గోల్డ్‌మెడల్, షార్ట్‌పుట్‌లో సిల్వర్ మెడల్, 100మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. త్వరలో స్విట్జర్లాండ్‌లో జరిగే జూనియర్స్ ఏసియాగేమ్స్ లక్ష్యంగా గచ్చిబౌలిలో ప్రస్తుతం శిక్షణ పొందుతున్నాడు. రవికిరణ్ గతంలో సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో ఉంటూ రెండు సంవత్సరాలు శిక్షణ పొందాడు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి తొమ్మిది బంగారు పతకాలు సాధించాడు. జాతీయ స్థాయి భువనేశ్వర్, బెంగళూరు, ఇంటర్నేషనల్ మీట్ ప్యారిస్‌లో జరిగిన క్రీడా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ గెలుచుకున్నాడు. ఏ పోటీ అయినా రవికిరణ్ పాల్గొంటే పతకం ఖాయమనే పేరుంది.

ఏసియన్ గేమ్స్ లక్ష్యంగా..

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ద్రోణాచారి అవార్డు గ్రహీత నాగపూరి రమేశ్ కోచ్ వద్ద త్వరలో స్విట్జర్లాండ్‌లో జరిగే జూనియర్ ఏసియన్ గేమ్స్ లక్ష్యంగా రవికిరణ్ శిక్షణ పొందుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ శిక్షణపై దృష్టి సారించలేకపోతున్నాడు. శిక్షణ మధ్యలో వదిలేస్తే ఇలాంటి అవకాశం మళ్లీ రాదని ఆందోళన చెందుతున్నాడు. తనకు దాతలు ఆర్థిక చేయూతనందిస్తే మరిన్ని పతకాలు సాధించి జిల్లాకే కాకుండా రాష్ట్రానికి మంచిపేరు తెస్తానని చెబుతున్నాడు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న సీతారామయ్య

నస్పూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు త్వరగా నిర్వహించాలని కోరుతూ ఈ నెల 6న చేపట్టనున్న ‹‹చలో హైదరాబాద్›› కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. శుక్రవారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసి మూడేళ్లు గడిచినా ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాల్ చేస్తూ తాము గతంలో హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. మూడు నెలల్లోపు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని సింగరేణి యాజమాన్యానికి, ఆర్ఎల్‌సీకి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. అయినా నేటి వరకు ఎన్నికల నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. 11వ వేజ్‌బోర్డులో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాన్ని సాధించామని తెలిపారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి కొట్టె కిషన్‌రావు, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ


వైకుంఠం

కాగజ్‌నగర్‌టౌన్: ఉపన్యాస పోటీల్లో కాగజ్‌నగర్ డిగ్రీ కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యార్థి కే వైకుంఠం ప్రతిభ కనబర్చాడు. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో నెహ్రూ యువ కేంద్రం ఖమ్మం ఆధ్వర్యంలో ఈనెల 28న యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఉపన్యాస పోటీల్లో కుమురం భీం జిల్లా నుంచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. 'పర్యావరణ కాలుష్యం–మానవ జీవితంపై ప్రభావం' అనే అంశంపై మాట్లాడి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు ఈ నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో గెలుపొందిన విద్యార్థి రూ.2 లక్షల నగదు బహుమతి అందుకోనున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి సీఓఈ సెట్‌కు దరఖాస్తు చేసుకునే తుది గడువు ఇప్పటికే ముగిసిందని, విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు ఈనెల 4వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జన్నారం: అతివేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి పడిపోగా దానిపై ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన హఫీజ్ తన భార్య రఫియా బేగం (38)తో కలిసి దస్తురాబాద్ మండలం రేవోజీపేటలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి మంచిర్యాల వెళ్తుండగా జన్నారం మండలం తపాలపూర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అతివేగంగా ఉన్న ద్విచక్రవాహనం అదుపుతప్పి కల్వర్టు పక్కన గల బండరాయికి ఢీకొట్టింది. వెనుక కూర్చున్న రఫియా బేగం 20 మీటర్ల దూరం ఎగిరిపడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. హఫీజ్‌కు కాలు విరగడంతోపాటు చేతులకు గాయాలయ్యాయి. 108లో అతడిని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. అతివేగంగా వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు. అడవిపంది అడ్డురావడంతో జరిగిందా? లేదా.. అతివేగంగా అదుపుతప్పడంతో జరిగిందా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వెంకటాపూర్‌లో పత్తి దగ్ధం


ఘటనాస్థలంలో పత్తిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

భీమిని: వెంకటాపూర్ గ్రామంలో గురువారం రాత్రి చదువుల శ్రీనివాస్‌కు చెందిన 20 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ తన చేను నుంచి సేకరించిన సుమారు 280 క్వింటాళ్ల పత్తిని ధర లేక ఇంటి వద్ద నిల్వ చేసుకున్నాడు. గురువారం రాత్రి పత్తి నుంచి మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు చెందిన సుమారు రూ.1.80లక్షల విలువైన పత్తి పూర్తిగా దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని తాండూర్ సీఐ జగదీశ్, ఎస్సైలు వెంకటేశ్, సురేశ్ పరిశీలించారు. 20 రోజుల వ్యవధిలో గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన పత్తికి మంటలు అంటుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే అనుమానం వ్యక్తంచేస్తూ బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుడు లేక తెరుచుకోని నక్కలగూడ పాఠశాల


ఉపాధ్యాయుడు లేక మూసి ఉన్న పాఠశాల

రెబ్బెన: మండలంలోని నక్కలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శుక్రవారం ఉపాధ్యాయుడు లేని కారణంగా తెరుచుకోలేదు. ఇక్కడ పని చేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయుడు లాంగ్ లీవ్ పెట్టగా అయన స్థానంలో మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు. అయితే శనివారం సదరు ఉపాధ్యాయుడు సెలవు పెట్టగా పాఠశాల తెరుచుకోలేదు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గదికి తాళం వేసి ఉండడాన్ని చూసి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై కాంప్లెక్స్ హెచ్‌ఎం మేడి చరణ్‌దాస్‌ను వివరణ కోరగా.. పాఠశాల రెగ్యులర్ టీచర్ లాంగ్‌లీవ్‌పై వెళ్లడంతో మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశామని తెలిపారు. అతడు సెలవు పెట్టడం, శుక్రవారం చుట్టు పక్కల పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంతో పాఠశాల తెరుచుకోలేదని పేర్కొన్నారు. సోమవారం నుంచి క్రమంతప్పకుండా పాఠశాలను నిర్వహించేలా చూస్తామని చెప్పారు.

రాత పరీక్ష నిర్వహణ


అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పని చేస్తున్న అర్హులైన అభ్యర్థులకు టిండల్ సూపర్‌వైజర్స్, బిట్ గ్రైండర్, కార్పెంటర్ రోప్ స్ప్లైసర్ ప్రమోషన్ల కోసం ఏరియా వర్క్‌షాప్‌లో శుక్రవారం రాత పరీక్ష, ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు మాట్లాడుతూ.. ఉద్యోగుల పదోన్నతిలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన వారికి పదోన్నతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, డీజీఎం (పీ)అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, అధికారులు సిరికొండ మల్లేశ్, కాసర్ల బాపయ్య తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామశివారులోని గాంధారి మైసమ్మ ఖిల్లా గుట్ట ప్రతిబింబం శుక్రవారం చెరువు నీటిలో చూడముచ్చటగా కనిపించింది. ఇటుగా వెళ్లేవారు ఆగి మరీ.. ఈ చిత్రాన్ని చూడడం 'సాక్షి' కంటపడింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల

విధి నిర్వహణలో ఆగిన ఊపిరి

- గుండెపోటుతో విద్యుత్ విజిలెన్స్ అధికారి మృతి


షేక్ కరీమొద్దీన్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కుమ్మరితాండ గ్రామంలో శుక్రవారం విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారి షేక్ కరీమొద్దీన్ (55) గుండెపోటుతో మృతి చెందాడు. తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ విద్యుత్ ప్రధాన కార్యాలయం నుంచి తనిఖీలు చేయడానికి కుమ్మరితాండ గ్రామానికి కరీమొద్దీన్ వచ్చాడు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో హఠాత్తుగా గుండెపోటు రాగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి ఉద్యోగులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు కరీమొద్దీన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. కరీమొద్దీన్ మృతిపై విద్యుత్ సిబ్బంది సంతాపం తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ చౌక్ సమీపంలో శుక్రవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని శ్రీరాం కాలనీకి చెందిన సంజీవ్ బైక్ పైనుంచి కిందపడ్డాడు. తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వైద్యం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఇచ్చోడ: సాథ్‌నంబర్ గ్రామానికి చెందిన బిషే దిగంబర్ (45) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సాథ్‌నంబర్‌కు చెందిన దిగంబర్ కొద్దిరోజులుగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. గురువారం అతిగా మద్యం సేవించి రాత్రి 8గంటల ప్రాంతంలో తన వంటపాలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం వరకు దిగంబర్ ఇంటికి రాక పోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వంటపాలం వద్దకు వెళ్లి చూడగా దిగంబర్ మృతదేహం కనిపించింది. భార్య రేణుక ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్, వికెట్ తీసిన ఆనందంలో.., సీనియర్స్ విభాగంలో ఫైనల్ చేరిన వివేకానంద కళాశాల జట్టు

నేడు జూనియర్, సీనియర్ ఫైనల్ పోరు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఎస్‌పీఎల్ సీజన్ 4 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో.. స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌పీఎల్ 4 నేటితో ముగియనుంది. కాగా.. శుక్రవారం మ్యాచ్‌ను కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రికెట్‌లో క్రీడాకారులకు కొదువ లేదని.. టాలెంట్ ఉన్న వారు ఎందరో ఉన్నారని.. వారి ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఒక ప్లాట్ ఫాం అని పేర్కొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌లో వివేకానంద

సీనియర్స్ విభాగంలో ఉదయం రెండో సెమీఫైనల్ వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్.. ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ జట్ల మధ్య జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్సారార్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. అనంతరం 76 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన వివేకానంద జట్టు కేవలం 6.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. నిఖిల్ 19 బంతుల్లో 2 సిక్స్‌లు, 5 ఫోర్లతో 36 పరుగులు చేయగా.., సాయినాథ్ 17 బంతుల్లో 5 ఫోర్లతో 27 పరుగులు చేసి జట్టుకు ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేశారు.

నేటి ఫైనల్ మ్యాచ్‌లు

జూనియర్స్ ఫైనల్: ఉదయం 9 గంటలకు జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, తిమ్మాపూర్ వర్సెస్ ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల. సీనియర్స్ ఫైనల్: మధ్యాహ్నం 12 గంటలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ వర్సెస్ వాగ్దేవి డిగ్రీ కళాశాల, మంచిర్యాల.